క్లుప్తంగా

సంపూర్ణ అక్షరాస్యతతోనే దేశాభివృద్ధి



వైఎస్సార్ గ్రంథాలయం వద్ద ర్యాలీ

భీమవరం: అంతర్జాతీయ అక్షరాస్యత దినోత్సవం సందర్భంగా భీమవరం పట్టణంలోని డాక్టర్ వైఎస్సార్ మెమోరియల్ ప్రథమశ్రేణి గ్రంథాలయంలో సదస్సు, ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మౌలానా అబుల్ కలాం ఆజాద్ మున్సిపల్ స్కూల్ ఎల్‌పీఎల్ ప్రధానోపాధ్యాయుడు కె బాబాజీ సాహెబ్, విజ్ఞాన వేదిక సేవా సంస్థ అధ్యక్షుడు అల్లు శ్రీనివాస్ మాట్లాడుతూ సంపూర్ణ అక్షరాస్యతతోనే దేశాభివృద్ధి జరుగుతుందని, ప్రతి ఒక్కరూ నిరక్షరాస్యత నిర్మూలనకు పాటుపడాలన్నారు. గ్రంథాలయాల్లోని పుస్తకాలు చదివి పోటీ పరీక్షల్లో ఉత్తీర్ణులై ఉద్యోగాలు పొంది ఉన్నత స్థాయిలో ఉన్నవారిని ఆదర్శంగా తీసుకుని విద్యార్థులు ముందుకు సాగాలన్నారు. ఈ కార్యక్రమానికి గ్రంథాలయాధికారి ఎస్ వెంకటేశ్వరరావు అధ్యక్షత వహించగా బి వెంకటేశ్వరరావు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు అవార్డులు

వీరవాసరం: సమాజాన్ని ఉన్నత స్థితిలోకి తీసుకు వెళ్లడం ఉపాధ్యాయులకే సాధ్యమని ఉభయగోదావరి జిల్లాల టీచర్ ఎమ్మెల్సీ బొర్రా గోపి మూర్తి తెలిపారు. వీరవాసరం ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో పాల్గొని ఆయన మాట్లాడారు. ఉపాధ్యాయులంతా ఉత్తమ విద్యా బోధనతో విద్యార్థులను తీర్చిదిద్దాలని సూచించారు. ఉపాధ్యాయుల సమస్యల పట్ల తక్షణం స్పందించి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. 2025 -26 విద్యా సంవత్సరంలో మండల ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైనవారికి ఈ సందర్భంగా అవార్డులు అందజేశారు.

రేషన్ దుకాణాల తనిఖీ



రేషన్ దుకాణాలను తనిఖీ చేస్తున్న తహసీల్దార్

పాలకోడేరు: మండలంలోని రేషన్ దుకాణాలను తహసీల్దార్ ఎస్.భారతీ విజయలక్ష్మి సోమవారం తనిఖీ చేశారు. విస్సాకోడేరు గ్రామంలోని 21, 33, 34 రేషన్ షాపులను, గోరగనమూడి గ్రామంలోని 19 నెంబర్ రేషన్ షాపును తహసీల్దార్ ఆకస్మికంగా తనిఖీలు చేశారు. కార్డుదారులకు కొత్త రేషన్ స్మార్ట్ కార్డులను పంపిణీ చేశారు. పౌరసరఫరాల శాఖ క్యూఆర్ కోడ్‌తో కార్డుదారుల నుంచి ఫీడ్ బ్యాక్ తీసుకున్నారు. సరుకుల నిల్వలను తనిఖీ చేసి సంతృప్తి చెందారు. ఆమె వెంట డిప్యూటీ తహసీల్దార్ ఆది శేషయ్య ఉన్నారు.

ముగిసిన చెరుకువాడ వివాదం

ఉండి: గత కొద్ది రోజుల నుంచి చెరుకువాడలో రగులుతున్న వివాదం ఎట్టకేలకు ముగిసింది. పెద్దల సమక్షంలో ఇరుపక్షాలకు రాజీ కుదిర్చినట్లు ఆకివీడు రూరల్ సీఐ జగదీశ్వరరావు తెలిపారు. గ్రామంలో శాంతి భద్రతలకు ఎటువంటి విఘాతం కలిగించకుండా ఇరువర్గాలకు చెందిన ప్రజలు శాంతియుతంగా ఉంటామని, కలసిమెలసి ముందుకు సాగుతామని హామీ ఇవ్వడంతో వివాదం సద్దుమణిగినట్లు చెప్పారు. అనంతరం ఇరువర్గాల సమక్షంలో మద్యం దుకాణాన్ని తిరిగి తెరిచారు. ఈ కార్యక్రమంలో ఆకివీడు రూరల్ సీఐ జగదీశ్వరరావు, ఉండి ఎస్సై ఎండీ నసీరుల్లా, గ్రామ పెద్దలు సర్పంచ్ కొండవేటి సాంబశివరావు, ఉంగరాల నాగేశ్వరరావు, మెతూషేల, మార్కురాజు, పులిదిండి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

కళాశాల సమస్యలపై కలెక్టర్‌కు వినతి

భీమవరం (ప్రకాశంచౌక్): నరసాపురం ప్రభుత్వ ఎయిడెడ్ బిజినెస్ కళాశాల కరస్పాండెంట్ చేస్తున్న అక్రమాలు, కళాశాల సమస్యలపై అధ్యాపకులు, విద్యార్థులు కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. సోమవారం కలెక్టరేట్ పీజీఆర్ఎస్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్‌ను కలిసి తమ సమస్యలు వివరించి పరిష్కరించాలని కోరారు.

బాధితులకు పరామర్శ



బాధితులను పరామర్శిస్తున్న నల్లి రాజేష్

భీమవరం: కాళ్ల మండలం సీసలి గ్రామంలో సోమవారం రాత్రి ఇరువర్గాల మధ్య జరిగిన కొట్లాటలో గాయపడి భీమవరం ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితులను మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడు నల్లి రాజేష్ పరామర్శించారు. ఘటనకు సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. బాధితులకు సత్వర చికిత్స అందించాలని ఆయన కోరారు. ఆయన వెంట మలమహానాడు జిల్లా అధ్యక్షుడు గుండే నగేష్‌బాబు, మర్రి శామ్యూల్, గుజ్జుల నిరీక్షణ రావు, బండారు బాల సుందరం, మట్టా చంద్రశేఖర్ తదితరులున్నారు.

యూరియా భయం.. సాగు అయోమయం

- యూరియా కొరతతో అన్నదాతల అవస్థలు
- ఖరీఫ్‌కే ఇలా ఉంటే రబీ ఎలా అని ఆందోళన



అజ్జమూరులో యూరియా సరఫరాపై వ్యవసాయాధికారిని నిలదీస్తున్న దృశ్యం



ఖరీఫ్ సాగులో ఎరువులు చల్లుతున్న రైతు

ఆకివీడు: యూరియా కొరతతో అన్నదాతల్లో భయం నెలకొంది. ఖరీఫ్‌లోనే కూటమి ప్రభుత్వం యూరియా సరఫరా చేయలేక తిప్పలు పడుతుంటే రబీలో యూరియా మరింత ఎక్కువ అవసరం అవుతుందని, అప్పుడు ప్రభుత్వం సరఫరా చేయకపోతే తమ పరిస్థితి ఏంటని రైతన్నలు ఆందోళన చెందుతున్నారు. దీనికితోడు యూరియా మితంగా వాడాలని, నానో యూరియా వినియోగించుకోవాలని చేస్తున్న ప్రకటనలతో రైతులు సాగు చేపట్టాలా? వద్దా? అనే సందేహంలో పడ్డారు.

ఖరీఫ్‌కు సరే... రబీకైనా పరిష్కారం దొరికేనా?

వ్యవసాయానికి ఆయువుపట్టుగా ఉన్న ఉండి నియోజకవర్గంలో 31,018 ఎకరాల్లో వరి సాగు చేపడుతున్నారు. రబీలో ఈ సాగు మరింత పెరిగే అవకాశం ఉంది. ఖరీఫ్‌లోనే నియోజకవర్గంలో యూరియా కనాకష్టం మీద సరఫరా చేశారు. చాలా గ్రామాల్లోని రైతులకు సకాలంలో అందడంలేదు. సొసైటీల్లో యూరియాను ఉంచడంతో దూర ప్రాంతాల్లో ఉన్న రైతులు అక్కడకు వెళ్లేసరికి యూరియా లేదని చెప్పడంతో తీవ్ర నిరుత్సాహంగా వెనుదిరుగుతున్నారు. దీనిని కప్పిపుచ్చుకునేందుకు ప్రభుత్వ యంత్రాంగం యూరియా వాడకం వలన చీడపీడలు, తెగుళ్లు వస్తాయని సాకుగా చెప్పడంపై రైతులు మండిపడుతున్నారు. ఖరీఫ్‌కే చేతులెత్తేసిన ప్రభుత్వం రబీకి యూరియా ఏవిధంగా సరఫరాచేస్తుందని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రబీకి యూరియా అధికంగా వాడే అవకాశం ఉండటంతో నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో 5,250 మెట్రిక్ టన్నుల యూరియా అవసరం ఏర్పడనుంది. ఇంత పెద్ద మొత్తంలో యూరియా సరఫరా జరుగుతుందా అనే సందేహంలో రైతులున్నారు. యూరియా వేయడం ద్వారా వరి ఏపుగా ఎదగడమే కాకుండా ఆకులు, కాండం ధృఢంగా ఉంటాయని రైతులు చెబుతున్నారు.

యూరియా కాదు.. నానో యూరియా వాడండి

యూరియా బదులుగా నానో యూరియా వాడాలని ప్రభుత్వం ప్రచారం చేస్తోంది. లిక్విడ్ రూపంలో లభించే నానో యూరియా రైతులకు ఉపయోగపడుతుందని, చీడపీడలు రావని వ్యవసాయాధికారులు ప్రచారం చేస్తున్నారు. దీనిలో నత్రజని శాతం అధికంగా ఉంటుందంటున్నారు. యూరియా వాడటం వల్ల తెగుళ్లు, చీడపీడలు ఎక్కువగా వస్తాయని, యూరియా వదిలివేయండని అవగాహనా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. దీంత యూరియా సరఫరా చేయలేక ప్రభుత్వం చేతులెత్తేసిందని రైతులు బహిరంగంగానే విమర్శిస్తున్నారు.

దక్కని సబ్సిడీలు, రాయితీలు.

కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత రైతులకు అందాల్సిన సబ్సిడీలు, రాయితీల యంత్రాల అందుబాటులో లేవు. ఏడాదిన్నర దాటినా అన్నదాత సుఖీభవ అందలేదు. మొదటి విడత అందినప్పటికీ మరో రెండు విడతలు అందాల్సి ఉంది. రైతులకు రూ.20 వేలు ఇస్తానన్న ప్రభుత్వం నేటికీ గత ప్రభుత్వం అందజేస్తున్న రూ.13 వేలు ఆర్థిక సహాయాన్ని మాత్రమే మూడువిడతలుగా అందజేస్తుంది. పంటల బీమా ప్రీమియం సైతం చెల్లించడంలేదు. గత ఖరీఫ్‌లో నష్టపోయిన రైతాంగానికి పంటల బీమా వస్తుందా? రాదా అనేది తెలియక రైతులు వేయికళ్లతో ఎదురు చూస్తున్నారు. సబ్సిడీపై ట్రాక్టర్లు, స్ప్రేలు అందడంలేదు.

నియోజకవర్గంలో కావాల్సిన యూరియా (మె.టన్నుల్లో)

మండలం	సాగు ఎకరాల్లో	ఖరీఫ్	రబీ
ఆకివీడు	4,300	460	850
ఉండి	10418	800	1,650
కాళ్ల	4100	350	650
పాలకోడేరు	11,200	1,050	2,100

యూరియా అందుబాటులో లేదు



మండలంలో యూరియా అందుబాటులో లేకపోవడంతో రైతులకు ఖరీఫ్ సాగు ఇబ్బందికరంగా తయారైంది. ప్రైవేటు ఎరువుల దుకాణాల్లోనూ అందుబాటులో లేదు. యూరియా లేకపోతే చేను తయారు అవ్వదు. ఏ యూరియా రైతులకు అందడంలేదు. రబీకి యూరియా ఇంకా అధికంగా అవసరం ఉంటుంది. సకాలంలో యూరియా అందుబాటులోకి తీసుకురావాలి.

– ఎరిచర్ల సాంబర్లిన్, రైతు నాయకుడు, చెరుకుమిల్లి, ఆకివీడు మండలం

'అన్నదాత పోరు'కు తరలిరండి



వాండ్రంలో అన్నదాత పోరు పోస్టర్ విడుదల చేస్తున్న ఆంజనేయరాజు

ఉండి: రైతుల సమస్యలపై ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో చేపట్టనున్న అన్నదాత పోరు కార్యక్రమానికి రైతులు, వైఎస్సార్ సీపీ శ్రేణులు అధిక సంఖ్యలో తరలివచ్చి జయప్రదం చేయాలని వైఎస్సార్ సీపీ మండలాధ్యక్షుడు పీవీఆర్‌కే ఆంజనేయరాజు పిలుపునిచ్చారు. అన్నదాత పోరు కార్యక్రమం పోస్టర్‌ను సోమవారం వాండ్రం గ్రామంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆంజనేయరాజు మాట్లాడుతూ అన్నదాత పోరు కార్యక్రమంలో భాగంగా భీమవరం ఆర్డీవో కార్యాలయంలో వినతిపత్రం ఇచ్చేందుకు నియోజకవర్గ కార్యాలయం పెదఅమిరం నుంచి ఉదయం 10 గంటలకు బయలుదేరుతున్న దృష్ట్యా మండలంలోని రైతులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలిరావాలని కోరారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ఆయా గ్రామాల్లోని రైతు భరోసా కేంద్రాల ద్వారా అన్ని రకాల ఎరువులు, పురుగుమందులు రైతులకు అందుబాటులో ఉండేవని, రైతు ఎక్కడికీ వెళ్లాల్సిన అవసరం ఉండేది కాదని, ఇప్పుడు పరిస్థితి చాలా అధ్వానంగా మారిపోయిందన్నారు. రైతులకు కనీసం పూర్తిస్థాయిలో ఎరువులు అందిచలేని స్థితిలో కూటమి ప్రభుత్వం ఉందని ఎద్దేవా చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు బుద్దరాజు రంగారాజు, రాజేంద్ర, పలువురు రైతులు పాల్గొన్నారు.

భీమవరం అర్బన్: రైతుల సమస్యలపై వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో చేపట్టనున్న అన్నదాత పోరు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆ పార్టీ మండల అధ్యక్షుడు జల్లా కొండయ్య కోరారు. మంగళవారం ఉదయం 9 గంటలకు భీమవరం మండలంలోని రాయలం గ్రామంలో చినిమిల్లి వెంకటరాయుడు నివాసం వద్దకు పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తరలివచ్చి అన్నదాత పోరు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు.

ఆకివీడు: వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో చేపట్టిన అన్నదాత పోరు కార్యక్రమానికి పార్టీ శ్రేణులతోపాటు రైతులంతా తరలి రావాలని ఆ పార్టీ మండల, పట్టణ అధ్యక్షులు నంద్యాల సీతారామయ్య, అంబటి రమేష్ పిలుపునిచ్చారు. రైతులకు అవసరమయ్యే యూరియా, ఇతర ఎరువుల్ని సకాలంలో అందజేయాల్సిన ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం వహిస్తుందని ఆరోపించారు. రైతు సేవాకేంద్రలకు వెళ్లాల్సిన యూరియా సొసైటీలకు మళ్లించడంతో రాజకీయ ప్రాబల్యం పెరిగిపోయిందన్నారు.

బైక్ ర్యాలీని విజయవంతం చేయాలి

వీరవాసరం: ప్రజా సమస్యల పరిష్కారంపై వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో నిర్వహించనున్న బైక్ ర్యాలీని విజయవంతం చేయాలని ఆ పార్టీ వీరవాసరం మండల కన్వీనర్ సీహెచ్ సత్యనారాయణ మూర్తి సోమవారం పిలుపునిచ్చారు. పార్టీ భీమవరం నియోజకవర్గ ఇన్‌చార్జి చినిమిల్లి వెంకట రాయుడు అధ్వర్యంలో పార్టీ కార్యాలయంల నుంచి మంగళవారం ఉదయం 9 గంటలకు బైక్ ర్యాలీ ప్రారంభమవుతుందని చెప్పారు. యూరియా కొరత, రైతులకు ఇన్సూరెన్స్, విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్, వికలాంగుల పింఛన్, ఆక్వా రంగానికి గిట్టుబాటు ధర కల్పించడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందన్నారు. బైక్ ర్యాలీ ద్వారా వెళ్లి ఎంపీడీఓకు సమస్యలపై వినతి పత్రం అందచేయడం జరుగుతుందన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొని బైక్ ర్యాలీని విజయవంతం చేయాలని కోరారు.

యూరియా కొరతపై నిరసన



తహసీల్దార్ కార్యాలయం వద్ద సీపీఐ ఆందోళన

భీమవరం: యూరియా కొరతను నిరసిస్తూ స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద సీపీఐ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు చెల్లబోయిన రంగారావు, ఎం సీతారాంప్రసాద్, రైతు సంఘం జిల్లా కార్యదర్శి వైవీ ఆనంద్ మాట్లాడుతూ యూరియా కొరతను నివారించడానికి అధికారులు యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టాలన్నారు. కోఆపరేటివ్ సొసైటీలు, రైతు సేవా కేంద్రాల ద్వారా రైతులకు సరిపడా యూరియా, డీఏపీ వంటి ఎరువులను సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ జిల్లాలో యూరియా కొరతలేదని అధికారులు చెబుతున్నా క్షేత్ర స్థాయిలో పరిస్థితులు దారుణంగా ఉన్నాయని ధ్వజమెత్తారు. అనంతరం తహసీల్దార్ రావి రాంబాబుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో కిలారి మల్లేశ్వరరావు, మల్లుల శ్రీనివాసరావు, నాగిడి శాంతమూర్తి, ఛాన్ బాషా, వీరవల్లి బాబ్జీ, దండు శ్రీనివాసరాజు తదితరులు పాల్గొన్నారు.

పీజీఆర్ఎస్‌కు 6 ఫిర్యాదులు



ఫిర్యాదు చేస్తున్న వైఎస్సార్ సీపీ నేతలు మెంటే లక్ష్మణరావు, నంద్యాల సీతారామయ్య

ఆకివీడు: స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి 6 అర్జీలు అందినట్లు ఎంపీడీఓ మార్కండేయేశ్వరరావు చెప్పారు. మండలంలోని కుప్పనపూడి గ్రామంలో కొందరు స్థానికులు తమ ఇళ్లలోని సెప్టిక్ ట్యాంక్ నీటిని పైపుల ద్వారా డ్రెయిన్‌లోకి వదులుతున్నారని, దీనివల్ల ప్రజలు తీవ్ర ఇబ్బంది పడి, అనారోగ్యానికి గురవుతున్నారని గ్రామస్తుడు మెంటే లక్ష్మణ్ ఫిర్యాదు చేశారన్నారు. దుంపగడప గ్రామంలోని మంచినీటి చెరువుకు వచ్చే పంట కాల్వకు ఇరువైపులా ఉన్న చేపలు, రొయ్యల చెరువుల వల్ల మంచినీటి చెరువు కలుషితమవుతోందని గ్రామానికి చెందిన సూరంపూడి రాంబాబు ఫిర్యాదు చేసినట్లు చెప్పారు. గుమ్ములూరు సెంటర్‌లోని హిందూ శ్మశాన వాటికలో ఆక్రమణలు తొలగించినా మళ్లీ ఆక్రమణలు చేపట్టారని, అదే ప్రాంతంలో సేవ పేరుతో ఆక్రమించిన భూమిని సర్వే చేసి తొలగించాలని ఆ ప్రాంతానికి చెందిన శలా భాస్కరరావు ఫిర్యాదు చేశారన్నారు. ఆహార తనిఖీ అధికారులు నగర పంచాయతీ పరిధిలో ఎన్ని తనిఖీలు చేయాలి, నెల నెలా ఎన్ని చేస్తున్నారనే విషయాన్ని తెలియజేయాలని మోరా రామిరెడ్డి ఫిర్యాదు చేశారని, సీఎం రిలీఫ్ ఫండ్ అనర్హులకు ఇచ్చారని,దీనిపై విచారణ చేయాలని, రుద్ర భూమి సమస్యను, ఆక్రమణలను పూర్తి స్థాయిలో ప్రక్షాళన చేయాలని ఆ ప్రాంతానికి చెందిన బత్తుల రవీంద్ర ఫిర్యాదు చేసినట్లు ఎంపీడీఓ తెలిపారు.

దినచర్యలో వ్యాయామం భాగం కావాలి



విజేతలకు అందించే మోటార్ బైక్‌లను ఆవిష్కరిస్తున్న సీఐ నాగరాజు

భీమవరం: ఆరోగ్య పరిరక్షణకు ప్రతి ఒక్కరూ ప్రత్యేక శ్రద్ధ కనబరచాలని, దానిలో భాగంగా దినచర్యలో వ్యాయామం భాగం కావాలని భీమవరం వన్‌టౌన్ సీఐ ఎం నాగరాజు అన్నారు. పట్టణంలో న్యూ ఆంధ్ర బాడీబిల్డర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 21వ తేదీన స్థానిక బీఆర్ అంబేడ్కర్ భవనంలో నిర్వహించే మిస్టర్ ఆంధ్ర బాడీ బిల్డింగ్ పోటీల్లో విజేతలకు బహుమతులుగా అందించే మూడు మోటార్ బైక్‌లను సోమవారం సీఐ ఆవిష్కరించారు. న్యూ ఆంధ్ర బాడీ బిల్డర్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి షేక్ ఖాసిం మాట్లాడుతూ పోటీల్లో విజేతలకు బైకులు బహుమతులుగా అందజేయడంతోపాటు నగదు, షీల్డ్స్ అందిస్తామన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ జిల్లా చైర్మన్ దాసి వరప్రసాద్, కుబేంద్ర, షేక్ ఖాజీ, మున్నా, ఆసిఫ్, అల్లు శ్రీనివాస్, మోటేపల్లి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వాలంటరీ టీచర్లకు పుస్తకాల పంపిణీ



పుస్తకాలు పంపిణీ చేస్తున్న తహసీల్దార్

కాళ్ల: వాలంటరీ టీచర్లకు తహసీల్దార్ సుందర్ సింగ్, ఇన్‌చార్జి ఎంపీడీవో నాగేశ్వరరావు చేతుల మీదుగా సోమవారం వెలుగు అధికారులు పుస్తకాలు పంపిణీ చేశారు. ఈసందర్భంగా వెలుగు ఏపీఎం శ్రీనివాసరావు మాట్లాడుతూ కాళ్ల మండలంలో డ్వాక్రాలో ఉన్న నిరక్షరాస్యులైన 2 వేల మంది మహిళలను గుర్తించి, ఈ ఏడాది వారికి చదవడం, రాయడం, వాళ్ల పొదుపులు, అప్పులు వాళ్లే లెక్క చూసుకోవడం తెలిసే విధంగా తయారు చేయాలనేది లక్ష్యమన్నారు. ప్రతి 10 మంది నిరక్షరాస్యులకు ఒక వాలంటీర్ టీచర్‌ని మ్యాప్ చేసి వారి ద్వారా వీడియో, పుస్తకాల రూపంలో ప్రతిరోజూ సాయంత్రం ఒక గంట చదువు నేర్పడం అనేది లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. కార్యక్రమంలో పలువురు వెలుగు సిబ్బంది పాల్గొన్నారు.

రుణ యాప్‌ల పట్ల జాగ్రత్తగా ఉండాలి



భీమవరం రైల్వే స్టేషన్‌లో రుణ యాప్‌ల పట్ల అవగాహన కల్పిస్తున్న దృశ్యం

భీమవరం: ఆన్‌లైన్ రుణ యాప్‌ల పట్ల జాగ్రత్తగా ఉండాలని, మోసపూరిత యాప్‌లను నమ్మవద్దని భీమవరం టౌన్ రైల్వే స్టేషన్ ఎస్సై దస్తగిరి, ఎస్ఎంజి శ్రీనివాస్ అన్నారు. భీమవరం టౌన్ రైల్వే స్టేషన్‌లో సోమవారం ఈగల్ సెల్ ఆధ్వర్యంలో సైబర్ నేరాల పట్ల ప్లకార్డుల ప్రదర్శన, అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భగా దస్తగిరి, శ్రీనివాస్ మాట్లాడుతూ అపరిచితుల వ్యక్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, మోసపూరిత యాప్‌లను ఇన్‌స్టాల్ చేయడం వల్ల ఇబ్బందులు తప్పవన్నారు. ప్రజల్లో చైతన్యం తీసుకురావడానికి ఈగల్‌సెల్ ఇటువంటి అవగాహన కార్యక్రమాలను నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ఈగల్ సెల్ సభ్యుడు చెరుకువాడ రంగసాయి, దాసరి శ్రీరాములు, పెచ్చెట్టి విజయ్, గాథం నాగభూషణం, చింతల నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ ఏఈపై దళిత మహిళల ఫిర్యాదు



ఉండి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తున్న దళిత మహిళలు

ఉండి: ఉండి ఎలక్ట్రికల్ ఏఈ పీ శ్రీనివాసరావుపై పాములపర్రు దళిత మహిళలు సోమవారం సాయంత్రం పోలీసులకు ఫిర్యాదు చేశారు. అనంతరం ఫిర్యాదు కాపీలను పత్రికలకు విడుదల చేసారు. దర్శి మేరీ, తేలి వెంకటలక్ష్మి, కడిమి మేటీ చేసిన ఫిర్యాదు ప్రకారం గతంలో గ్రామానికి చెందిన తాటిపట్టి నాగులు అనే ఆక్వారైతు తమకు చెందిన శ్మశానంలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయడంతో దానిని తొలగించమని గత నెలలో రెండు సార్లు విద్యుత్ అధికారులకు ఫిర్యాదు చేశామన్నారు. మొదటి సారి పట్టించుకోని అధికారులు రెండవసారి ఫిర్యాదుపై స్పందించి ట్రాన్స్‌ఫార్మర్‌కు విద్యుత్ నిలుపుదల చేశారని, అనంతరం తిరిగి విద్యుత్ పునరుద్ధరించారన్నారు. దీంతో తమకు జరిగిన అన్యాయంపై ఈ నెల 6వ తేదీన ఉండిలోని ఏఈ కార్యాలయానికి వెళ్లి నిరసన తెలిపామన్నారు. దీనిపై మాట్లాడేందుకు పిలిచిన విద్యుత్ ఏఈ తమతో అసభ్యంగా ప్రవర్తించారని, కులం పేరుతో దూషించారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఏఈపై తగిన చర్యలు తీసుకుని తమకు న్యాయం చేయాలని, కోరారు.

చదువుతోనే సమాజాభివృద్ధి

పాలకొల్లు సెంట్రల్: ప్రతి వ్యక్తి చదువుతోనే సమాజాభివృద్ధి సాధ్యమని పలువురు వక్తలు అన్నారు. స్థానిక జీవీఎస్‌వీఆర్ఎం మున్సిపల్ మోడల్ ప్రైమరీ స్కూల్‌లో అంతర్జాతీయ అక్షరాస్యత దినోత్సవం ఘనంగా నిర్వహించారు. సోమవారం పాఠశాల ఉపాధ్యాయులు టి.మధుసూధన్‌రెడ్డి మాట్లాడుతూ ప్రతి వ్యక్తికి చదువు ఎంత ముఖ్యమో ఈ అక్షరాస్యత ద్వారా తెలియపరిచామన్నారు. 1965 సెప్టెంబర్ 8వ తేదీన యునెస్కో అంతర్జాతీయ అక్షరాస్యత దినోత్సవంగా ప్రకటించిందన్నారు. 1966 నుంచి క్రమం తప్పకుండా అక్షరాస్యత దినోత్సవం నిర్వహిస్తున్నారన్నారు. అలాగే అద్దేపల్లి సత్యనారాయణమూర్తి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అంతర్జాతీయ అక్షరాస్యతా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు హోంవర్క్ డైరీలు, క్రేయాన్స్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు రాయపూడి భవానీ ప్రసాద్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ఎక్సైజ్‌శాఖ స్పెషల్ డ్రైవ్‌లో ఏడు కేసుల నమోదు

భీమవరం: భీమవరం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో మూడు రోజులుగా స్పెషల్ డ్రైవ్ నిర్వహించి నాలుగు అనధికార మద్యం విక్రయం కేసులు, బహిరంగంగా మద్యం సేవిస్తున్న ముగ్గురిపై కేసులు నమోదు చేసినట్లు ఎక్సైజ్ సీఐ కె బలరామరాజు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. బెల్ట్ షాపులు నిర్వహిస్తున్నా, బహిరంగ ప్రాంతాల్లో మద్యం సేవించే వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. దాడుల్లో ఎస్సైలు పీవీవీఎస్ ఉమా మహేశ్వరరావు, పి సునీల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

బాలుడికి ఆర్థిక సహాయం

భీమవరం: కష్టాల్లో ఉన్న వారిని ఆదుకోవడం సామాజిక బాధ్యత అని కృష్ణ బలిజ, పూసల వెల్ఫేర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ గంటా త్రిమూర్తులు అన్నారు. పట్టణంలోని 3వ వార్డు కళాభవన్ వీధికి చెందిన బాలుడు నల్లమట్టి సాయిమహేంద్ర గాయపడడంతో అతని వైద్య సహాయం నిమిత్తం త్రిమూర్తులు రూ.5 వేలు ఆర్థిక సహాయం అందజేశారు.

జనవిజ్ఞాన వేదిక జిల్లా నూతన కమిటీ ఎన్నిక

భీమవరం: జనవిజ్ఞాన వేదిక పశ్చిమ గోదావరి జిల్లా నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. భీమవరం యూటీఎఫ్ జిల్లా కార్యాలయంలో జరిగిన 18వ జిల్లా మహాసభల్లో జిల్లా కమిటీ ఏకగ్రీవంగా ఎన్నికైంది. జిల్లా గౌరవ అధ్యక్షులుగా డాక్టర్ చుండూరి సాయిబాబు, డాక్టర్ కేఎస్‌పీఎస్ వర్మ, డాక్టర్ మొగిలి వీరాస్వామి, అధ్యక్షునిగా జె రామలక్ష్మణరావు, ప్రధాన కార్యదర్శిగా మల్లుల శ్రీనివాస్, కోశాధికారిగా టి వెంకటేశ్వరరావు, ఉపాధ్యక్షులు సీహెచ్ ప్రసాదరావు, ఆర్.సత్యనారాయణ, కె.రాయపరాజు, కార్యదర్శులుగా ఎ.జాన్సన్, సీహెచ్ ఉదయ్‌కిరణ్, వై అజయ్‌కుమార్, పి.హరికృష్ణ, సీహెచ్ రాజు, సమతా కన్వీనర్‌గా సీహెచ్ ప్రియ, చెకుముకి కన్వీనర్‌గా ఆర్ వెంకన్నబాబు, సోషల్ మీడియా కన్వీనర్‌గా పి ఫణిరాజేష్,, సాంస్కృతిక విభాగం కన్వీనర్‌గా డి సత్యనారాయణ, యూత్ కన్వీనర్‌గా రాంబాబు మరో 9 మంది కమిటీ సభ్యులుగా ఎన్నికయ్యారు.

గరికపాటికి నివాళి



గరికపాటి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పిస్తున్న దృశ్యం

భీమవరం: కళ కాసుల కోసం కాదని, ప్రజల కోసమని నమ్మిన డాక్టర్ గరికపాటి రాజారావు నాటకాలు, నాటికలు, పాటలు, బుర్రకథల ద్వారా ప్రజల్లో చైతన్యం రగిలించిన ధన్యజీవి అని ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.సీతారాంప్రసాద్ అన్నారు. సోమవారం గరికపాటి వర్థంతి సందర్భంగా స్థానిక సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. స్వాతంత్ర్య ఉద్యమంలో రాజారావు కళారూపాలు ప్రదర్శిస్తూ ప్రజలను చైతన్య పరిచారని, ఆయన ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. ముందుగా రాజారావు చిత్రపటానికి పూలమాలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జవ్వాది దాశరధి శ్రీనివాస్, నాగిడి శాంతమూర్తి, చాంద్ బాషా, మల్లుల శ్రీనివాసరావు, తిరుమాని కామేశ్వరరావు, కాటి వెంకటరత్నం తదితరులు పాల్గొన్నారు.